# సీఎం కేసీఆర్‌తోనే సుస్థిర పాలన

- బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజ
- తొమ్మిదేండ్లలో దేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ
- వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- పలు మండలాల నుంచి వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరిక

వనపర్తి, అక్టోబర్ 25 : కొట్లాడి సాధించుకున్న తెలంగాణకు సీఎం కేసీఆర్ ఈ పదేండ్లలో సుస్థిర, సుభిక్ష పాలన అందించారని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని తన నివాసంలో గోపాల్‌పేట మండలం ఎదుట్ల, సాకలిపల్లి, గోవులకుంట తండాలకు చెందిన పలు పార్టీల నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ పదేండ్లలో సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. ఈ పదేండ్లలో తెలంగాణను దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రభుత్వంపై విపక్షాలు చేస్తున్న ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నారని, వారికి గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. తాను రాజకీయాలు మొదలు పెట్టినప్పటి నుంచి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్నానని, ఈ పదేండ్లలో నియోజకవర్గంలోని తండాలు, మారుమూల పల్లెలకు రోడ్డు సౌకర్యం, మెరుగైన వసతులు కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల్లో తనకు మద్దతు నిచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గురువారం వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరిగే సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభకు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎదుట్ల ఎంపీటీసీ బాల్‌రెడ్డి, సాయిరెడ్డి, ఉపసర్పంచ్ క్రాంతి, విష్ణు, ఉడుముల గిరి, రాష్ట్ర సహకార యూనియన్ సభ్యులు తిరుమల మహేశ్, రాష్ట్ర మార్క్‌ఫైడ్ డైరెక్టర్ విజయ్‌కుమార్, పట్టణ ఎన్నికల సమన్వయ కర్త అరుణ ప్రకాశ్, గొర్రెల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు కురుమూర్తియాదవ్, బీఆర్ఎస్ నాయకులు మహేశ్వర్ రెడ్డి, రాములు యాదవ్, ఆవుల రమేశ్, నక్కమహేశ్ పాల్గొన్నారు.



కర్నూలు కార్యాలయంలో ఎస్ఈతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

## సాగునీటిని విడుదల చేయాలి

- ఇరిగేషన్ ఎస్ఈని కలిసిన ఎమ్మెల్యే అబ్రహం

ఉండవెల్లి, అక్టోబర్ 25 : ఆర్డీఎస్‌కు సాగునీరు విడుదల చేయలని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ శేఖర్‌రెడ్డిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే అబ్రహం బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల రైతులు మిరప, పత్తి, కంది, మొక్కజొన్న పంటలను సాగుచేశారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం, ఆర్డీఎస్ కాల్వకు సాగునీరు విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. టీబీ డ్యాంకు ఇండెంట్ పెడితే తుమ్మిళ్ల మోటర్లను ఆన్ చేసి రైతులకు సాగునీరు అందించేందుకు వీలుంటుందని ఎస్ఈకి ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి ఆర్డీఎస్ నుంచి సాగునీటి విడుదలపై చర్చించారు. ఈఎన్‌సీతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ప్రిన్సిపాల్ సెక్రటరీ తెలిపినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# బీజేపీకి ఓటేస్తే మోటర్లకు మీటర్లు

- కాంగ్రెస్‌కు ఓటేస్తే చిమ్మచీకట్లే..
- మూడు గంటలా? మూడు పంటలా?
- ప్రజలు మరోసారి ఆలోచించుకోవాలి
- సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరికలు: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



నాగర్‌దొడ్డిలో ఎమ్మెల్యే బండ్ల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

గద్వాల, అక్టోబర్ 25 : త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని గెలిపిస్తే వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగిస్తారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు గంటల కరెంటే దిక్కని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మూడు గంటల కరెంటిచ్చే కాంగ్రెస్ కావాలో.. మూడు పంటలకు కరెంటిచ్చే బీఆర్ఎస్ కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ధరూర్ మండలం గుడ్డెందొడ్డికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు 60మంది సర్పంచ్ రఘువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో, ధరూర్‌కు చెందిన 35మంది ఎంపీటీసీ దౌలన్న ఆధ్వర్యంలో, మల్దకల్ మండలం నేతువానిపల్లికి చెందిన 110మంది, నీలిపల్లికి చెందిన వెంకటన్న, మీసాల కృష్ణ, కోటిరెడ్డి, సవారి, పరమేశ్, సంజన్న, హనుమంతు, రాజు, ఉలిగేపల్లికి చెందిన 60మంది, కేటీదొడ్డి మండలం సోంపురానికి చెందిన 20మంది బుధవారం బీర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ, కాంగ్రెస్ పరిపాలించే ప్రాంతాల్లో లేని పథకాలు నేడు తెలంగాణ రాష్ట్రంలో నేరుగా ప్రజలకు అందిస్తున్న ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల నడ్డివిరిచే పథకాలు ప్రవేశ పెట్టడానికి ప్రయత్నిస్తుందన్నారు. కాంగ్రెస్ రైతులకు మూడు గంటల కరెంట్ చాలు అంటుంది.. ఇటువంటి పార్టీలకు మనం ఓటు వేయాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో చివరి ఆయకట్టు వరకు నీరు అందించడానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు ఈరన్న, సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్, వెంకటన్న, ఆలయకమిటీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, సర్పంచ్ విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు రమేశ్‌రెడ్డి, మధునాయకి, శేషాద్రినాయుడు, సత్యంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, విక్రమసింహారెడ్డి, అబ్రహం, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

**భారీగా చేరికలు**

మల్దకల్, అక్టోబర్ 25 : తెలంగాణ రాష్ట్రంలో సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బుధవారం మండల కేంద్రంతో పాటు నాగర్‌దొడ్డి, తాటికుంట గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నాగర్‌దొడ్డిలో ఎమ్మెల్యే పర్యటించగా బీజేపీ ముఖ్య నాయకులు తిరుమల్‌రెడ్డి, శరత్‌రెడ్డి, రాముడు, వీరేశ్, జయన్న, ఉపేంద్రగౌడ్, పరశురాముడు, వెంకటన్న, కిష్టన్న, శంకర్, గౌరన్న, కుర్వ నరేశ్, వీరేశ్, బండి నర్సింహులుతోపాటు 50మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే మల్దకల్‌కు చెందిన బీజేపీ మాజీ ఎంపీటీసీ కుర్వ తిమ్మప్ప తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే సమక్షంలో కారెక్కారు. అలాగే తాటికుంటలో బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ భవిష్యత్‌లో న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సర్పంచులు పురుషోత్తంరెడ్డి, ప్రతాప్, రాజు, ఎంపీటీసీలు జయమ్మ నర్సింహులు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ సవారన్న, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు విక్రంసింహారెడ్డి, అజయ్, చంద్రశేఖరెడ్డి, తూంక్రిష్ణారెడ్డి, సుధాకర్‌గౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాసులు



నోడల్ అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

గద్వాల, అక్టోబర్ 25 : జిల్లాలో త్వరలో జరిగే శాసనసభ ఎన్నికలకు సంబంధించి ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకొని అధికారులు సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ తన చాంబర్‌లో ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశమై ఎన్నికల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. అభ్యర్థుల ఖర్చులను లెక్కించే టీం ఎప్పటికప్పుడు ఖర్చుల వివరాలు తెలపాలన్నారు. ఎంసీఎంసీ కమిటీ పత్రికలు, ఛానల్లో వచ్చిన పే న్యూస్, యాడ్స్ సమాచారాన్ని పంపాలన్నారు. విలేజ్ నోడల్ అధికారులు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. సీ-విజిల్ యాప్‌లో జిల్లాస్థాయిలో వచ్చిన దరఖాస్తులను ఆధారాలతో పరిశీలించాలని సీ-విజిల్ యాప్‌ను పర్యవేక్షించే అధికారులను ఆదేశించారు. జిల్లాకు ఎన్నికల పరిశీలకులు వచ్చిన సమయంలో వారికి పూర్తిస్థాయిలో జిల్లా ఎన్నికల వివరాలు వివరించడానికి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ నోడల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎన్నికల నోడల్ అధికారులు వీరభద్రప్ప, ప్రియాంక, విజయ్‌భాస్కర్, నారాయణ, ఎస్‌డీసీ సుబ్రమణ్యం, అధికారులు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ కమిటీకి ఐదు కేసులు

- రూ.15లక్షలకు పైగా నగదు సీజ్
- అదనపు కలెక్టర్ శ్రీనివాసులు

గద్వాల అర్బన్, అక్టోబర్ 25 : ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో బుధవారం గ్రీవెన్స్ కమిటీలో ఐదు కేసులు నమోదైనట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందం, పోలీసులు పటిష్ట నిఘా నేపథ్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్రమంలో పట్టుబడిన రూ.15లక్షల నగదును సీజ్ చేసినట్లు వివరించారు. సీజ్ చేసిన నగదుకు సంబంధించిన బాధితులు తగు అధారాలు జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించాలని సూచించారు. వివిధ అవసరాలకు సంబంధించిన లావాదేవీల నిమిత్తం తీసుకెళ్లే క్రమంలో ప్రజలు పట్టుబడినట్లు పేర్కొన్నారు. వీటిని తీసుకోవడానికి అప్పీలుకు వచ్చిన బాధితుల రసీదులను పరిశీలించి జిల్లా గ్రీవెన్స్ కమిటీ సభ్యులు, ఎఫ్ఎస్ బృందం, పోలీసుల రికార్డులను సంబంధిత అధికారులకు అప్పగించామన్నారు.

## జూరాలకు స్వల్ప వరద

ధరూరు, అక్టోబర్ 25 : జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్ప వరద కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో 1,800 క్యూసెక్కులు ఉండగా ఎడమ కాల్వకు 1,140 క్యూసెక్కులు, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ సామర్థ్యం 6.658 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.951 టీఎంసీలు నిల్వ చేస్తున్నారు.

## బ్యాంకర్లుసహ కరించాలి

- ఎస్పీ రితిరాజ్

గద్వాల అర్బన్, అక్టోబర్ 25 : ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికలు నిర్వహించేందుకు బ్యాంకర్లు సహకరించాలని బ్యాంక్ అధికారులకు ఎస్పీ రితిరాజ్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ హాల్‌లో జిల్లాలోని వివిధ బ్యాంకర్లతో సమావేశమై మాట్లాడారు. మల్టీ ట్రాన్సాక్షన్స్, వరుసగా భారీ మొత్తంలో నగదు బదిలీ చేసే వారి వివరాలు పోలీసులకు సమచారమివ్వాలన్నారు. ఎప్పటినుంచో ఇన్‌యాక్టివ్‌గా ఉండి ఈ మధ్యనే యాక్టివ్ అయిన అకౌంట్స్‌పై దృష్టి పెట్టాలన్నారు. ఐటీ, బ్యాంక్ హెడ్ ఆఫీస్‌ల నుంచి ఎవరికైనా అలర్ట్స్ వస్తే అలాంటి వారి వివరాలను వెంటనే పోలీసులకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

**రసీదులు వెంట ఉంచుకోవాలి**

బంగారు వ్యాపారం చేసే వ్యాపారస్తులు తమ సామగ్రికి సంబంధించిన రసీదులు వెంట ఉంచుకోవాలని ఎస్పీ రితిరాజ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో బంగారు వర్తక వ్యాపారస్తులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపారస్తులు బంగారు రవాణా చేసే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన పలు సూచనలు చేశారు. బంగారానికి సంబంధించి షాపుల రసీదులు, సేల్స్ బిల్స్, కస్టమర్ అయితే కస్టమర్ బిల్స్ సంబంధించి రశీదులను వెంట తీసుకువెళ్లాలని సూచించారు.అలాగే డబ్బులకు సంబంధించి 50,000 రూ..పై ఉన్నట్లు అయితే వాటికి సంబంధించిన రశీదు వెంటపెట్టుకొవాలన్నారు.సరైన రశీదు లేని బంగారం,డబ్బులు పోలీస్‌ల తనీఖీలలో పట్టుబడితే జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తారని తెలిపారు. ఈ విషయన్ని ఇతర వ్యాపారులకు కూడా తెలియజేయాలని సూచించారు. సమావేశంలో బంగారు వర్తక వ్యాపార అసోసియేషన్ అధ్యక్షుడు గట్టు ఈశ్వరయ్య,ప్రధాన కార్యదర్శి శంకర చారి తదితరులు ఉన్నారు.

## జోగుళాంబ సన్నిధిలో గద్వాల జోన్ డీఐజీ

అలంపూర్, అక్టోబర్ 25 : జోగుళాంబ గద్వాల జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ కుటుంబ సమేతంగా బుధవారం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. వారికి ఆలయ పాలక మండలి కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, ఆలయ ఈవో పురేందర్‌కుమార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. వారి వెంట సీఐ రాజు, ఎస్సై రమేశ్ తదితరులున్నారు.



అమ్మవారి ఆలయ ఆవరణలో డీఐజీ కుటుంబసభ్యులు